ఆక్రమణల చెరలో ఆట స్థలం

- పరాధీనమవుతున్న పి.మల్లవరం జెడ్పీ హైస్కూల్ స్థలం
- ఎకరం భూమిలో అక్రమంగా కట్టడాల నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



పి.మల్లవరంలో ప్రభుత్వ భూమిని కప్పేసి వేస్తున్న రహదారి, పక్కనే చేపట్టిన అక్రమ నిర్మాణం

తాళ్లరేవు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఆటస్థలంలో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. విద్యార్థుల భవిష్యత్ కోసం పాఠశాలకు కేటాయించిన భూమిని పలువురు ఆక్రమించుకుని నిర్మాణాలు సాగిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ సదరు పాఠశాల ఉపాధ్యాయులు గత ఆరు నెలలుగా మొత్తుకుంటున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నెలల తరబడి అధికారుల మొద్దునిద్ర వెనుక కొందరు నేతల హస్తం ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆరు నెలల క్రితమే ఫిర్యాదు

పి.మల్లవరం గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలకు 2021 మార్చి 20వ తేదీన సర్వే నెంబర్ 40/4లో నాలుగెకరాల గ్రామ కంఠం భూమిని కేటాయించారు. అక్కడ సుమారు మూడెకరాల్లో పాఠశాల భవనాలతో పాటు ఆట స్థలాన్ని ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మించారు. అయితే ప్రహరీ అవతల మరో ఎకరం భూమి పల్లంగా ఉండడం, దాన్ని కప్పాలంటే భారీగా ఖర్చవుతుందన్న ఉద్దేశంతో అప్పట్లో అలాగే వదిలేశారు. పల్లం కావడంతో వర్షం నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తూ ఉండేది. ప్రస్తుతం అక్కడ ఎకరం రూ.50 లక్షలకు పైగా విలువ చేస్తుండడంతో సదరు భూమిపై స్థానికంగా కొందరు అక్రమార్కుల కన్ను పడింది. స్థలాన్ని కొద్దికొద్దిగా చదునుచేసి, శాశ్వత నిర్మాణాలు చేపట్టడం మొదలుపెట్టారు. పాఠశాల స్థలంతో పాటు అక్కడే కాలనీకి ఇచ్చిన స్థలంలో ఖాళీగా ఉన్న భూమిలోనూ నిర్మాణాలు చేపట్టారు. అది గమనించిన హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పాలెపు వెంకట శ్రీనివాసరావు 2024 ఫిబ్రవరి 26వ తేదీన పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే చేసి పాఠశాలకు చెందిన భూమిని పూర్తిగా అప్పగించాలని లేఖ రాశారు. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు జరుగుతున్న నిర్మాణాలను నిలుపుచేయాలని నోటీసులు జారీ చేసి మిన్నకుండిపోయారు.

ఆక్రమణల పర్వం మళ్లీ మొదలైంది

అప్పట్లో నోటీసులు ఇచ్చాక అక్రమార్కులు కాస్త వెనక్కి తగ్గినా ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ కట్టడాల నిర్మాణం ప్రారంభించారు. ముందు ఆక్రమించేస్తే తరువాత పట్టాలు ఇప్పిస్తామంటూ కొందరు నేతలు హామీ ఇవ్వడంతోనే వారి అనుచరులు ఆక్రమణలకు పాల్పడుతున్నట్లుగా తెలుస్తుంది. పల్లంగా ఉన్న భూమిని మెరక చేసి ఇళ్ల నిర్మాణాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని పూడ్చి వేసి రహదారి నిర్మాణాన్ని సైతం చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో దర్జాగా రహదారి వేస్తుండడంతో కొందరు మరోసారి పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానికంగా ఉద్రిక్తత రేగుతుందన్న భయంతో పంచాయతీ అధికారులు జెడ్పీ హైస్కూల్ స్థలాన్ని సర్వే చేయాలంటూ తహసీల్దార్‌కు లేఖ రాశారు. అయితే స్థలాలు ఆక్రమిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ తెర వెనుక కొందరు నాయకులు ఒత్తిడి తీసుకొస్తున్నట్లుగా చర్చ సాగుతోంది. ఆక్రమణలను అడ్డుకుని జెడ్పీ ఉన్నత పాఠశాల స్థలాన్ని వారికి అప్పగించాలని, పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని నిజమైన పేదలకు పట్టాలుగా ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పాఠశాల స్థలాన్ని సర్వే చేసి అప్పగించాలని కోరుతూ ఆరు నెలల క్రితమే అధికారులకు ప్రధానోపాధ్యాయుడు రాసిన లేఖ

తహసీల్దార్‌కు లేఖ రాశాం

"హైస్కూల్‌ను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను గతంలో నిలుపుదల చేశాం. ఇటీవల మాకు వచ్చిన ఫిర్యాదుల మేరకు మళ్లీ అక్కడ చేపట్టిన కట్టడాల నిర్మాణాలను వెంటనే ఆపుతాం. హైస్కూల్‌కు కేటాయించిన భూములకు సంబంధించి సర్వే చేయించాలని తహసీల్దార్‌ను కోరాం. సర్వే అనంతరం పాఠశాలకు కేటాయించిన పూర్తి భూమిని వారికి అప్పగిస్తాం."

– సూరంపూడి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి

బంద్ ప్రశాంతం

- తెరుచుకోని దుకాణాలు, విద్యాసంస్థలు
- ఆర్టీసీ బస్సులు తిరగక అవస్థలు పడిన ప్రజలు



పేరూరు వైజంక్షన్‌లో నిరసన తెలుపుతున్న మాలమహానాడు కార్యకర్తలు

అమలాపురం టౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పునకు వ్యతిరేకంగా మాల మహానాడు జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్ కారణంగా అమలాపురం పట్టణంలో దుకాణాలు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. మాల మహానాడు నాయకులు పట్టణంలోని ప్రధాన రోడ్లపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఎంఏకే భీమారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉండ్రు బాబ్జి, రాష్ట్ర కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, రాష్ట్ర, జిల్లా మాల మహానాడు ప్రతినిధులు మెండు రమేష్ బాబు, నక్కా సంపత్‌కుమార్, పెయ్యల పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రూ.8 లక్షల నష్టం

అమలాపురం రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ బుధవారం చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా మాల మహానాడు నాయకులు అమలాపురం ఆర్టీసీ డిపోలో బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డిపోలో ఉన్న 149 బస్సులకు గాను 45 సర్వీసులు నిలిచిపోవడంతో రూ.8 లక్షల వరకూ ఆదాయం నష్టపోయామని డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు.

అల్లవరం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టిన బంద్‌లో భాగంగా వ్యాపార సంస్థలు, విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలను మాల మహానాడు కార్యకర్తలు మూయించివేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

తాళ్లరేవు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద, 216 జాతీయ రహదారిపై పలు దళిత సంఘాల నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చొల్లంగి నుంచి ఇంజరం వరకూ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దుకాణాలను మూసివేయించారు.



బంద్ కారణంగా అమలాపురం ముస్లిం వీధిలో మూతపడ్డ దుకాణాలు

కాట్రేనికోన: మండలం కేంద్రం కాట్రేనికోనలో మాలమహానాడు నాయకులు రోడ్డుపై బైఠాయించి సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఐ.పోలవరం: బంద్ కారణంగా మండల కేంద్రమైన ఐ.పోలవరం, మురమళ్ల, కేశనకుర్రు వంటి గ్రామాల్లో దుకాణాలు, వాణిజ్య సముదాయాలను మూసి వేశారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో పలు చోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఎదుర్లంక సమీపంలో 216 జాతీయ రహదారిపై మహిళలు బైఠాయించి నిరసన ప్రదర్శన చేశారు.

ఉప్పలగుప్తం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార, విద్యాసంస్థలు మూతపడ్డాయి. చల్లపల్లి, గొల్లవిల్లి ప్రధాన రహదారులపై మహిళలు ధర్నా నిర్వహించి నిరసన చేపట్టారు.

విచారణ జరుగుతుండగా ఎన్నికలేంటి?

యానాం: యానాం కోపరేటివ్ స్టోర్స్‌లో జరిగిన అవినీతిపై విచారణ కొనసాగుతుండగా ప్రస్తుతం కోపరేటివ్ స్టోర్స్ కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించడంపై ఎల్జీ కె.కైలాష్‌నాథన్‌కు ఫిర్యాదు చేసినట్లు సోషల్ యాక్టివిస్ట్ మండపాక సత్తిబాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యానాం కోపరేటివ్ స్టోర్స్‌కు సంబంధించి మద్యం షాపుల నిర్వహణలో రూ.71,29,569 సొమ్ము పక్కదోవ పట్టిందన్నారు. సొసైటీకి సంబంధం లేని వ్యక్తి దానికి బాధ్యుడని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. అనంతరం కోపరేటివ్ రీజినల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యుల బృందం తనిఖీ చేసి అవినీతి వాస్తవమేనని పుదుచ్చేరి రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్‌కు నివేదికను సైతం పంపారన్నారు. 2018–21 మధ్య కాలంలో జరిగిన ఐఎమ్ఎఫ్ఎల్ విక్రయాల్లో జరిగిన అవినీతిపై 44 పేజీల విచారణ నివేదికను సైతం పంపారన్నారు. ఇందులో ఐఎమ్ఎఫ్ఎల్ సెక్షన్ ఇన్‌చార్జి, ఏడుగురు సేల్స్‌మెన్‌లు సొమ్ములు దుర్వినియోగం చేశారని తేలిందన్నారు. వీరి నుంచి సొమ్ము రికవరీ చేయడానికి సంబంధించి ఇంకా విచారణ జరుగుతుండగా కోపరేటివ్ స్టోర్స్‌కు ఎన్నికలెలా నిర్వహిస్తారని ప్రశ్నించారు.

ఐదు ఖండాల్లో ఫ్రెంచ్ భాష



ఫ్రెంచి భాషపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధ్యక్షుడు సతీష్ నల్లా

యానాం: ప్రపంచంలోని ఐదు ఖండాల్లో సుమారు 300 మిలియన్ల ప్రజలు ఫ్రెంచి భాషను మాట్లాడుతున్నారని, అత్యధికంగా మాట్లాడే భాషల్లో 5వ స్థానంలో ఫ్రెంచి ఉందని పుదుచ్చేరి ఫ్రెంచ్ కాన్సుల్ జనరల్ జీన్‌ఫిలిప్పీ హట్టర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గాజుల ఫంక్షన్ హాలులో ది అలయన్స్ ఫ్రాంకైజ్ ఆఫ్ పుదుచ్చేరి ఆధ్వర్యంలో యానాం రీజియన్ వారికి ఉచిత ఫ్రెంచి భాష ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఫ్రాన్స్ సరిహద్దు దేశాలైన బెల్జియం, జర్మనీ, స్విట్జర్లాండ్, ఇటలీ, అండోరా, స్పెయిన్‌లో సైతం ఫ్రెంచి మాట్లాడతారన్నారు. ఆయా దేశాలకు ఉపాధి కోసం వచ్చే వారికి ఈ ఆన్‌లైన్ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గతంలో ఫ్రెంచిపాలిత ప్రాంతాల్లో ఫ్రెంచి భాషను వ్యాప్తి చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, అధ్యక్షుడు డాక్టర్ సతీష్ నల్లం, డైరెక్టర్ జాలికోస్, ఫ్రెంచి పౌరుల ప్రతినిధి సాధనాల బాబు పాల్గొన్నారు.

పుదుచ్చేరికి ఈవీఎంల తరలింపు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నిక నేపథ్యంలో తీసుకొచ్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను తిరిగి బుధవారం యానాం నుంచి పుదుచ్చేరికి తరలించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఈవీఎంలను ప్రత్యేక వాహనంలో పోలీసు భద్రత మధ్య తరలించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఎన్నికల శాఖ ప్రతినిధి తిరుకోటి అర్జునరావు, అధికారులు పాల్గొన్నారు.



వాహనంలో తరలిస్తున్న ఈవీఎంలు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు: మండల పరిధిలోని ఇంజరం 33 కేవీ సబ్‌స్టేషన్, సుంకరపాలెం 11 కేవీ పరిధిలో చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం ఈ నెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ పల్లిపాలెం, సుంకరపాలెం, సుంకరపాలెం బైపాస్, లచ్చిపాలెం, ఉప్పంగల, తంగేటిపంపు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని కాకినాడ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తాళ్లరేవు, చొల్లంగి సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం తాళ్లరేవు, మల్లవరం, జార్జిపేట, గాడిమొగ, భైరవపాలెం, సీతారాంపురం, కోరంగి, పెదబొడ్డు వెంకటాయపాలెం, చినబొడ్డు వెంకటాయపాలెం, చొల్లంగి, చొల్లంగిపేట తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ విద్యుత్ ఉండదన్నారు.

సాయం అందేనా..!

- వరదల్లో పంటలు కోల్పోయిన రైతులు
- ఎనిమిది మండలాల్లో 1404 హెక్టార్లలో నష్టం
- పరిహారం కోసం ఎదురుచూపు




గోదావరి వరదకు ఎండిపోయిన వంగతోట

మామిడికుదురు: గోదావరి వరద కూరగాయల రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. ఎంతో కష్టపడి పండించిన కూరగాయల పంటలు తనలో కలిపేసుకుంది. పెట్టుబడి, శ్రమ అంతా నీటిలో తుడిచి పెట్టుకుపోయింది. వరద నీటిలో ముంపుబారిన పడిన పంటలు ఎండిపోయి, కుళ్లిపోయాయి. అరటి, బీర, బెండ, దొండ, వంగ, మునగ, బొప్పాయి, తమలపాకు తదితర రైతులకు తీరని నష్టం కలిగింది. నష్టపోయిన రైతులు మళ్లీ పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎన్యూమరేషన్ పూర్తయింది. త్వరలోనే పరిహారం వస్తుందని అధికారులు చెబుతున్నారు. జాప్యం లేకుండా వెంటనే పరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

1404 హెక్టార్లలో పంట నష్టం

పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాల్లో కూరగాయల తోటలు గత నెలలో వచ్చిన వరదకు దెబ్బతిన్నాయి. రెండు నియోజకవర్గాల్లోను 144.94 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు నిర్ధారించారు. 4584 మంది రైతులకు నష్టం వాటిల్లింది. పి.గన్నవరం నియోజకవర్గంలో 3,369 మంది రైతులకు చెందిన 925 హెక్టార్ల విస్తీర్ణంలో పంట దెబ్బతింది. కొత్తపేట నియోజకవర్గంలో 1215 మంది రైతులు పండించిన 479.94 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు పాడైపోయినట్లు ఉద్యాన శాఖాధికారులు నివేదిక రూపొందించారు. తుది నివేదికను సిద్ధం చేసి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

రూ.80 వేలు పెట్టుబడి పెట్టా



"ఎంతో కష్టపడి రెండెకరాల్లో మునగ పంట పండించా. రూ.80 వేలు వరకు పెట్టుబడి పెట్టా. పంట దిగుబడి వచ్చే సమయంలో గోదావరి వరద మొత్తం పంటను ముంచెత్తింది. మునగ తోట చనిపోయింది. దానిలోనే కూరగాయలు కూడా సాగు చేశా. అవి కూడా కుళ్లిపోయాయి. మంచి దిగుబడి వస్తుందని, ఆదాయం ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తే అంతా ఆడియాసలుగా మారాయి. నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి."

– కొమ్ముల వెంకటేశ్వరరావు, రైతు, పెదపట్నంలంక

పంట చేతికందే సమయంలో..



"60 ఎకరాల్లో బొంత, కర్పూర అరటి పంట సాగు చేశా. పంట సాగుకు రూ.50 లక్షలు వరకు పెట్టుబడి పెట్టా. పంట ఎంతో చక్కగా ఎదిగింది. అరటి తోటలు గెలలు వేశాయి. పంట చేతికందే సమయంలో గోదావరి వరద తోటలను ముంచేసింది. పది రోజుల పాటు వరద నీటిలో తోటలు మునిగి ఉండడంతో అంతా కుళ్లిపోయింది. నాతో పాటు చాలా మంది రైతులకు భారీగా నష్టం వచ్చింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి మమ్మల్ని ఆదుకోవాలి."

– నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రైతు, కె.ఏనుగుపల్లి

రూ.1.50 లక్షల నష్టం



"పి.గన్నవరం మండలం తాటికాయలవారిపాలెంలో ఎకరం భూమి కౌలుకు తీసుకున్నాను. అర ఎకరంలో పచ్చిమిర్చి, అర ఎకరంలో మునగ పంట సాగు చేశాను. గోదావరి వరదకు రెండు పంటలు పాడైపోయాయి. ఈ పంటల సాగుకు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. పంట కోతకు వచ్చే దశలో గోదావరి వరద నన్ను నిలువునా ముంచింది. మంచి ఆదాయం వస్తుందనుకున్న సమయంలో గోదావరి వరద కనీసం పెట్టుబడి కూడా దక్కకుండా చేసింది. సహాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి."

– వేమన పెద్దిరాజు, కౌలు రైతు, లంకలగన్నవరం

క్లుప్తంగా

పీఈటీ విష్ణుప్రసాద్‌కు సత్కారం



పీఈటీ విష్ణుప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు గౌరీ శంకర్ తదితరులు

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పీఈటీ పరమట విష్ణుప్రసాద్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు డి.గౌరీ శంకర్ అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు విష్ణు ప్రసాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు వై.సంజీవయ్య, తోట రవి, కె.సతీష్, ఉపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప్ పరామర్శ



రాజా రమేష్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: ఇటీవల గుండెకు చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న స్థానిక 17వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గుర్రం రాజా రమేష్‌ను మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు దూడల ఫణి, కురసాల బద్దాజీ, చిక్కాల రవి శంకర్, గుమ్మళ్ల సురేష్, గున్నేపల్లి భీమశంకరం, చిక్కం భీమేష్ తదితరులున్నారు.

పల్లంరాజుకు జక్కంపూడి పరామర్శ



పల్లంరాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజా, ఫుడ్ కమిషన్ సభ్యుడు కిరణ్ తదితరులు

అమలాపురం టౌన్: పితృవియోగంతో బాధపడుతున్న స్థానిక కాపు నాయకుడు గంధం పల్లంరాజును రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్‌లు బుధవారం పరామర్శించారు. పట్టణంలోని కుమ్మర్ల వీధిలో ఉన్న పల్లంరాజు ఇంటికి రాజా, కిరణ్‌లు వెళ్లి ఆయనకు ధైర్యం చెప్పారు. పల్లంరాజు తండ్రి సత్తిరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పల్లంరాజును పరామర్శించిన వారిలో మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, మెట్ల రమణబాబు తదితరులున్నారు.

మొక్కలు నాటిన చిరంజీవి అభిమానులు



పార్కులో మొక్కలు నాటుతున్న చిరంజీవి అభిమానులు

అమలాపురం టౌన్: సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకల్లో భాగంగా స్థానిక రవణం వీధిలోని గురిగుంట చెరువు పార్కులో ఆయన అభిమానులు బుధవారం మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు నల్లా చిట్టిబాబు, చిరంజీవి యువత జాతీయ ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను, బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి నల్లా నాయుడు, వర్రే శేషు, చిక్కం కిట్టు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు



పిచ్చికుక్క దాడిలో గాయపడిన ఓ మహిళ

అల్లవరం: మండలంలోని ఓడలరేవులో పిచ్చి కుక్క స్వైర విహారం చేసి పలువురిని తీవ్రంగా గాయపరిచింది. మంగళవారం జరిగిన ఈ ఘటనలో ఏడుగురు పిచ్చికుక్క కాటుకి గురయ్యారు. మన్నా కాలనీలో ఒకరు, చేపల మార్కెట్ వద్ద ఐదుగురు, ఏటిమొగ వద్ద ఒకరిని పిచ్చి కుక్క కరిచింది. పిచ్చికుక్క దాడిలో గాయపడిన బాధితులకు స్థానిక సీహెచ్‌సీలో చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన కొల్లు ముత్యాలు ప్రస్తుతం అల్లవరం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడు.

అల్లవరం తహసీల్దార్‌గా నరసింహారావు



అల్లవరం: అల్లవరం తహసీల్దార్‌గా వీవీఎల్ నరసింహారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఆయన మల్కిపురం తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. అక్కడ నుంచి అల్లవరం తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. తహసీల్దార్ నరసింహారావును ఎంపీడీఓ కృష్ణమోహన్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

23న గ్రామ సభల నిర్వహణ

తాళ్లరేవు: మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 2024–25 సంవత్సరానికి గాను కొత్త పనులు, ప్రతిపాదనల కోసం ఈ నెల 23వ తేదీన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ మోహనకృష్ణ బుధవారం తెలిపారు. ఈ మేరకు పంచాయతీల వారీగా నోడల్ అధికారులను నియమించామన్నారు. ఈ గ్రామసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు.

చిల్డ్రన్ హోమ్‌ల తనిఖీ

తాళ్లరేవు: మండల పరిధిలోని పరిధిలోని పలు చిల్డ్రన్‌హోమ్‌లను బుధవారం ఐసీడీఎస్ అధికారులు తనిఖీ చేశారు. చొల్లంగి అగ్రహారంలోని హోమ్‌తో పాటు, జి.వేమవరంలోని ఎవర్ లాస్టింగ్ గ్రేస్ చిల్డ్రన్స్ హాస్టల్, కొత్త కోరంగిలోని శ్రీదుర్గా మల్లేశ్వరి వృద్ధుల బాలల ఆశ్రమం, పరదేశమ్మపేటలోని ఆనంద నిలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేసినట్లు సీడీపీఓ వంజరాన మాధవి తెలిపారు. చిన్నారులు నివసించే హోమ్‌లలో పారిశుధ్యం సక్రమంగా ఉండాలని, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ఆమె వెంట సూపర్‌వైజర్‌లు లలిత నిర్మల, సత్య నళిని, నిబావాణి ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

అమలాపురం రూరల్: గారపాటి వీర్రాజు మెమోరియల్ ట్రస్ట్ తరపున కొత్తపేట మండలం అవిడి గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని యాళ్ల మోహన వెంకట లక్ష్మికి హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.25 వేల ఆర్థిక సాయాన్ని చేశారు. విద్యార్థినికి ఆర్థిక సాయం చెక్కును ట్రస్ట్ చైర్మన్ గారపాటి సూర్యనారాయణ బుధవారం అందజేశారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



కొంకాపల్లిలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అరుణ

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు పంచాయతీ పరిధిలోని కొంకాపల్లిలో మండల పరిషత్ నిధులతో ముత్యాలమ్మ గుడి వద్ద కల్వర్టు, డ్రైనేజీ నిర్మాణ పనులకు సర్పంచ్ దాసరి అరుణ బుధవారం శంకుస్థాపన చేశారు. పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పనసా బుజ్జి, దాసరి డేవిడ్, మెంబర్లు తిక్కా సరస్వతి, దూలం బుజ్జి, కురసాల వీరబాబు, పనసా అబ్బు, కైరం సురేష్, కానిపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో అర్హుల వివరాలు

యానాం: మత్స్యకార ప్రోత్సాహక బహుమతులకు దరఖాస్తు చేసుకున్న 222 మంది విద్యార్థులకు గాను 218 మంది అర్హత సాధించారని మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ 60 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నామన్నారు. ఎంపికైన విద్యార్థుల పేర్లను యానాం వెబ్‌సైట్‌లో పెట్టామని, అభ్యంతరాలుంటే ఈ నెల 27లోగా మత్స్యశాఖకు తెలియజేయాలని కోరారు.

నరసన్నను దర్శించుకున్న ఎస్సై

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం సఖినేటిపల్లి పోలీసుస్టేషన్ నూతన ఎస్సై కుడిపూడి దుర్గా శ్రీనివాసరావు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఎస్సైకు ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి తీర్థ, ప్రసాదాన్ని అందజేశారు.

స్నేహితుని పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే

మలికిపురం: తన స్నేహితుడు అయిన వైఎస్సార్ సీపీ నాయకుడు రుద్రరాజు సూరిబాబురాజు మృతి చెందడంతో బుధవారం ఆయన అంత్యక్రియలలో రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పాల్గొన్నారు. సూరిబాబు పాడె మోసిన రాపాక తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. చిన్న తనం నుంచీ తనకు రాజకీయపరంగా అన్ని విధాలుగా సూరిబాబు ఆసరగా ఉన్నారని రాపాక పేర్కొన్నారు.

మోటార్ల దొంగల అరెస్టు

మలికిపురం: మండలంలో విద్యుత్ మోటార్ల దొంగతనాలకు పాల్పడిన ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై పి.సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం గుడపల్లి పల్లిపాలెం సెంటర్‌లో గూడపల్లి పల్లిపాలెం గ్రామానికి చెందిన కొప్పాడి పవన్ కల్యాణ్, కొప్పడి నరసింహస్వామి, కొప్పాడి రాఘవ, కొల్లు రాజేష్, తిరుమని జాన్‌రత్నం మోటార్లను విక్రయించేందుకు రాగా వారిని అరెస్టు చేశామన్నారు. ఈ ఐదుగురు చెడు వ్యసనాలకు బానిసై గూడపల్లి పల్లిపాలెం, శంకర గుప్తం గ్రామంలోనూ పొలాలు, చెరువుల వద్ద ఉన్న ఎలక్ట్రికల్ మోటార్లను దొంగిలించి వాటిని అమ్ముకుని ఆ డబ్బులతో జల్సా చేస్తున్నారు. అ విధంగా బుధవారం వచ్చిన వారిని అరెస్టు చేసినట్లు మలికిపురం ఎస్సై తెలిపారు.